అథ్లెట్ల పతక మోత

భారత్ ఖాతాలో ఒకే రోజు 6 మెడల్స్ • 4X400 మిక్స్‌డ్ రిలేలో స్వర్ణం

ట్రిపుల్ జంప్, డెకథ్లాన్‌లో రజతాలు • ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

గుమి (దక్షిణ కొరియా): ప్రతిష్ఠాత్మక ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. తొలి రోజే రెండు పతకాలు సాధించిన భారత్.. రెండో రోజు ఏకంగా ఆరు పతకాలతో సత్తా చాటింది. 4X400 మిక్స్‌డ్ రిలేలో స్వర్ణం గెలిచిన మన అథ్లెట్లు.. డెకథ్లాన్, ట్రిపుల్ జంప్, మహిళల 1500 మీటర్లు, 400 మీటర్ల రేసులో రజతాలతో మెరిశారు. 4X400 మిక్స్‌డ్ రిలేలో సంతోష్ కుమార్, రూపల్, విశాల్, సుభా వెంకటేశన్‌తో కూడిన భారత బృందం.. 3 నిమిషాల 18.12 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి స్వర్ణం గెలిచింది. ఈ రేసులో చైనా (3:20.52) రెండో స్థానంతో రజతం గెలవగా శ్రీలంక (3:21.95) కాంస్యం నెగ్గింది. మహిళల 400 మీటర్ల ఫైనల్ రేసులో రూపల్.. 52.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజతం సాధించింది. జపాన్ (52.17 సెకన్లు)కు స్వర్ణం, ఉజ్బెకిస్థాన్ (52.79 సె.)కు కాంస్యం దక్కాయి. మహిళల 1500 మీటర్ల రేసులో పూజ.. 4:10.83 సెకన్లతో గమ్యాన్ని ముద్దాడి రజతంతో సత్తాచాటింది. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ 16.90 మీటర్లు దూకి రజతం సొంతం చేసుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో భారత అథ్లెట్ అబ్దుల్లా 16.72 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. పురుషుల డెకథ్లాన్‌లో తేజస్విని శంకర్.. 7,618 పాయింట్లు స్కోరు చేసి రజతం పట్టుకొచ్చాడు. కేవలం 16 పాయింట్లతో అతడు స్వర్ణం గెలిచే అవకాశాన్ని కోల్పోయాడు. పురుషుల 1500 మీటర్ల రేసులో యూనస్ షా.. 3:43.03 సెకన్లతో కాంస్యం దక్కించుకున్నాడు.

సెమీస్‌లో తమన్నా, ప్రియ

• థాయ్‌లాండ్ బాక్సింగ్ టోర్నీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. ప్రత్యర్థులపై దీటైన పంచ్‌లు విసురుతూ తమన్నా, ప్రియ, దీపక్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన మహిళల 51కిలోల కేటగిరీలో తమన్నా..లియు యు షాన్(చైనీస్ తైపీ)పై అలవోకగా గెలిచింది. 57కిలోల విభాగంలో ప్రియ 5-0తో పార్క్ అహ్ హ్యున్(దక్షిణకొరియా)పై చిత్తుగా ఓడించింది. బౌట్‌లో ఆది నుంచే రెచ్చిపోయిన ప్రియ..ప్రత్యర్థిపై పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడింది. పురుషుల 75కిలోల బౌట్‌లో దీపక్..కిమ్ హ్యున్(కొరియా)పై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించాడు. మరోవైపు జుగ్ను(85కి), అంజలి(75కి) ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు పటిష్ఠ భద్రత

ముల్లాన్‌పూర్: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు వేదికైన ముల్లాన్‌పూర్‌లో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా త్రివిధ దళాలు పాక్‌లోని ఉగ్రశిబిరాలపై దాడితో పోలీసులు మ్యాచ్ కోసం భారీ భద్రత కల్పించారు. ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు చూసేందుకు దేశం నలుమూలల నుంచి ప్రేక్షకులు వచ్చే అవకాశముందని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశామని పంజాబ్ స్పెషల్ డీజీపీ అర్పిత్ శుక్లా పేర్కొన్నారు. 65 మంది ఉన్నతాధికారులకు తోడు 2,500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

విజయంతో పునరాగమనం

అదరగొట్టిన సాత్విక్-చిరాగ్ జోడీ • మహిళా షట్లర్లకు నిరాశ

సింగపూర్: సుమారు మూడు నెలల విరామం తర్వాత బ్యాడ్మింటన్ కోర్టులోకి దిగిన భారత డబుల్స్ వీరులు సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి తమ పునరాగమనాన్ని విజయంతో ఆరంభించారు. సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-16, 21-13తో చూంగ్ హాన్-మహ్మద్ హైకల్‌పై అలవోక విజయం సాధించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన భారత జంట.. 40 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. సాత్విక్-చిరాగ్ మెరిసినా మిగిలిన షట్లర్లకు నిరాశ తప్పలేదు. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ షట్లర్ లక్ష్యసేన్ 21-15, 17-21, 5-13తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. మూడో గేమ్‌లో లక్ష్యసేన్‌కు వెన్ను నొప్పి బాధించడంతో అతడు రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఆ గేమ్ పూర్తికాకుండానే లిన్ విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ మొదటి రౌండ్‌కే ఇంటిబాట పట్టగా మహిళల డబుల్స్ ద్వయం వైష్ణవి-అలిషా సైతం నిరాశపరిచారు.

అల్కరాజ్ జోరు

ఫ్రెంచ్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ అదరగొడుతున్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్కరాజ్ 6-1, 4-6, 6-1, 6-2తో ఫాబియన్ మరోజాన్ (హంగరీ)పై గెలిచి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. రెండు గంటల పాటు సాగిన పోరులో అల్కరాజ్ ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచాడు. ఈ క్రమంలో తొలి సెట్‌ను అలవోకగా గెలిచిన అల్కరాజ్‌కు రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. బలమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లతో చెలరేగిన మరోజాన్ సెట్ గెలిచి పోటీలోకి వచ్చాడు. అయితే వెంటనే తేరుకున్న అల్కరాజ్..ప్రత్యర్థి ఎత్తులకు పైఎత్తు వేస్తూ వరుస పాయింట్లు కొల్లగొట్టాడు. మ్యాచ్ మొత్తంలో ఐదు ఏస్‌లు, ఒక డబుల్ ఫాల్ట్ చేసిన అల్కరాజ్ 25 అనవసర తప్పిదాలు చేశాడు. మరో పోరులో కాస్పర్ రూడ్ 6-2, 4-6, 1-6, 0-6తో నునో బోర్డెస్ చేతిలో ఓడాడు.

44 ఏండ్ల తర్వాత..

ఏషియన్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌నకు భారత్ ఆతిథ్యం

ఢిల్లీ: వచ్చే ఏడాది జరుగబోయే ఏషియన్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ ఆతిథ్య హక్కులను భారత్ దక్కించుకుంది. 2026 లో ఏప్రిల్ 1 నుంచి 10 దాకా నిర్వహించబోయే ఈ పోటీలకు అహ్మదాబాద్ (గుజరాత్) ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు ఏషియన్ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్ చివరిసారిగా 1982లో ఈ పోటీలకు ఆతిథ్యమివ్వగా మళ్లీ 44 ఏండ్ల తర్వాత హక్కులను దక్కించుకోవడం విశేషం.

ఫైనల్ బెర్తు ఎవరిదో?

నేడు పంజాబ్, బెంగళూరు క్వాలిఫయర్-1 పోరు • జోరు మీదున్న ఇరు జట్లు

నెలన్నర రోజులుగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఐపీఎల్‌లో కీలక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. లీగ్ దశ ముగిసి ప్లేఆఫ్స్ పోరుకు వేళయైంది. ప్రత్యర్థులపై అద్భుత విజయాలతో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ టాప్-2లో నిలిచిన పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) నేడు క్వాలిఫయర్-1లో అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. గతానికి పూర్తి భిన్నంగా సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ అగ్రస్థానంలో నిలిచిన జట్టు పంజాబ్ అయితే, ఈసారైనా తమ కలల కప్‌ను ముద్దాడాలని లక్ష్యంగా పెట్టుకున్నది ఆర్‌సీబీ. సమవుజ్జీలుగా కనిపిస్తున్న పంజాబ్, ఆర్‌సీబీ ముల్లాన్‌పూర్‌లో ఢీ అంటే ఢీ అనడానికి సర్వశక్తులతో సిద్ధమయ్యాయి. సొంత ఇలాఖాలో సత్తాచాటి తొలి ఫైనల్ బెర్తును దక్కించుకోవాలని పంజాబ్ చూస్తుంటే, లక్నోపై విజయమిచ్చిన కిక్‌తో ఆర్‌సీబీ.. పంజాబ్‌కు చెక్ పెట్టాలని చూస్తున్నది. లీగ్‌లో రెండు అత్యుత్తమ జట్ల మధ్య పోరు అభిమానులను అలరించడం ఖాయంగా కనిపిస్తున్నది.

ముల్లాన్‌పూర్(చండీగఢ్): ఐపీఎల్‌లో కీలకమైన ప్లేఆఫ్స్‌కు మరికొద్ది గంటల్లో తెరలేవబోతున్నది. చండీగఢ్‌లో కొత్తగా రూపుదిద్దుకున్న ముల్లాన్‌పూర్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్, ఆర్‌సీబీ మధ్య గురువారం క్వాలిఫయర్-1 పోరు జరుగనుంది. లీగ్ దశలో ప్రత్యర్థులపై అద్భుత విజయాలతో పంజాబ్, ఆర్‌సీబీ టాప్-2 బెర్తులు ఖరారు చేసుకున్నాయి. ఇదే జోరులో తమకు అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న ఐపీఎల్ టైటిల్‌ను ఎలాగైనా ఒడిసిపట్టుకునేందుకు పంజాబ్, బెంగళూరు పావులు కదుపుతున్నాయి. 2014లో పంజాబ్ చివరిసారి ఫైనల్ చేరితే, 2016లో ఆర్‌సీబీ తుదిపోరులో నిలిచింది. ఇలా రెండు జట్లకు ఐపీఎల్ టైటిల్ అనేది ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. 18 ఏండ్ల ఐపీఎల్ సుదీర్ఘ చరిత్రలో ఈ రెండు జట్లను టైటిల్ ఊరిస్తూనే ఉన్నది. అయితే ఈసారి ఎలాగైనా చరిత్ర తిరుగరాయాలన్న కసితో ఉన్న పంజాబ్, బెంగళూరు ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్నాయి. గత సీజన్ల లాగే ఈసారి కూడా అంతే అనుకున్న అభిమానుల అంచనాలను పూర్తిగా తలకిందులు చేస్తూ పంజాబ్, ఆర్‌సీబీ లీగ్ స్వరూపానే మార్చేశాయి. యువకులు, అంతర్జాతీయ స్టార్ల మేళవింపుతో కనిపిస్తున్న ఈ రెండు జట్లు టైటిల్ వేటలో ముందంజ వేసేందుకు పక్కా ప్రణాళికతో ఉన్నాయి.

అయ్యర్ X కోహ్లీ: పంజాబ్, ఆర్‌సీబీ మధ్య పోరును శ్రేయాస్ అయ్యర్, విరాట్ కోహ్లీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. బెంగళూరును వారి సొంతగడ్డపై ఓడించిన పంజాబ్‌కు కోహ్లీ ముల్లాన్‌పూర్‌లో ఏకపక్ష విజయంతో దీటైన సమాధానమిచ్చాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య పోరు సై అంటే సై అన్నట్లు సాగే అవకాశముంది. దీనికి తోడు తమ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఈ ఇద్దరు కీలక భూమిక పోషిస్తున్నారు. లీగ్‌లో ఇప్పటి వరకు కోహ్లీ(608 పరుగులు, స్ట్రైక్‌రేట్ 147.91), అయ్యర్(514 పరుగులు, స్ట్రైక్‌రేట్ 171.90)తో పరుగుల వేట కొనసాగిస్తున్నారు. క్వాలిఫయర్-1లోనే వీరిద్దరు ఇదే జోరు కొనసాగిస్తే అభిమానులకు పండుగే. ఇదిలా ఉంటే రెండు జట్లు దాదాపు ఒకే రకమైన పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. డబ్ల్యూటీసీ కారణంగా పంజాబ్‌కు దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ యాన్సెన్ దూరమైతే..గాయంతో టిమ్ డేవిడ్ క్వాలిఫయర్-1 ఆడేది అనుమానంగా మారింది. మరోవైపు గాయం నుంచి తేరుకున్న చాహల్ తిరిగి రావడం పంజాబ్‌కు లాభించే అంశం కాగా హాజిల్‌వుడ్ రాక..ఆర్‌సీబీకి మంచి కిక్కిచ్చే చాన్స్ ఉంది. మొత్తంగా క్వాలిఫయర్-1లో గెలిచి తొలి ఫైనల్ బెర్తు దక్కించుకునేది ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం దొరకనుంది.

జట్ల అంచనా

పంజాబ్: ప్రియాంశ్, ప్రభ్‌సిమ్రన్‌సింగ్, ఇంగ్లిస్, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), నేహల్ వధేరా, శశాంక్‌సింగ్, స్టొయినిస్, అజ్మతుల్లా, జెమీసన్, హర్‌ప్రీత్, అర్ష్‌దీప్‌సింగ్, చాహల్.

బెంగళూరు: కోహ్లీ, సాల్ట్, మయాంక్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేశ్‌శర్మ, కృనాల్ పాండ్యా, లివింగ్‌స్టోన్, షెఫర్డ్, భువనేశ్వర్, దయాల్, హాజిల్‌వుడ్, సుయాశ్.

ఎవరో ఆ ప్రపంచ సుందరి!

- ఎల్లుండి మిస్‌వరల్డ్ గ్రాండ్ ఫినాలే పోటీ
- తుది సమరంలో 40 మంది కంటెస్టెంట్స్
- బరిలో ఉన్న మిస్ ఇండియా నందిని గుప్తా

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): ప్రపంచ సుందరీ పోటీల తుది ఘట్టం దగ్గరపడింది. ఎల్లుండి హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరగనున్నది. ఆ వేదికపై ప్రపంచ సుందరి కిరీటం ఎవరిని వరించనుందో తేలిపోతుంది. 109 మంది అందాలభామలు ప్రపంచ సుందరీ కిరీటం కోసం తలపడగా, తుది పోటీలకు 40 మంది కంటెస్టెంట్లు ఎంపికయ్యారు. గ్రాండ్ ఫినాలేలోని ఒక్కో దశలో కొందరిని ఎలిమినేట్ చేస్తూపోయి, తుదివరకు నిలిచిన ముగ్గురిని ఫస్ట్, సెకండ్, థర్డ్ విజేతలుగా ప్రకటిస్తారు. హైటెక్స్‌లోని 31న జరగనున్న గ్రాండ్ ఫినాలేకు సుమారు 4 వేల మంది అతిథులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. మిస్ ఇండియా నందిని గుప్తా మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే పోటీలో ఉండటంతో అభిమానులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ఒక్క కేసు.. విచారణ నుంచి వైదొలిగిన ముగ్గురు జడ్జీలు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఓబుళాపురం ఇనుప ఖనిజం అక్రమ తవ్వకాల కేసులో సీబీఐ కోర్టు విధించిన జైలు శిక్షను రద్దు చేయాలంటూ దోషులు గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, ఓఎంసీ కంపెనీ, మెఫజల్ ఖాన్, రాజగోపాల్ హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ చేపట్టేందుకు బుధవారం ఒక్కరోజే ముగ్గురు న్యాయమూర్తులు నిరాకరించారు. తొలుత జస్టిస్ కే శరత్ విచారణ నుంచి వైదొలుగుతున్నట్ట ప్రకటించి, ఆ వ్యాజ్యాన్ని మరో న్యాయమూర్తికి నివేదించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. దీంతో రాత్రి 7 గంటల సమయంలో జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ దగ్గరకు ఆ కేసు వచ్చింది. అనంతరం ఆయన కూడా ఆ కేసును మరో న్యాయమూర్తికి నివేదించాలని రిజిస్ట్రీని ఆదేశించడంతో జస్టిస్ భీమపాక నగేశ్ వద్దకు చేరింది. కానీ, రాత్రి 7.30 గంటలు దాటిన తర్వాత జస్టిస్ నగేశ్ కూడా ఆ కేసు విచారణ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. దీంతో విచారణ జూన్‌కు వాయిదా పడింది.

'కేబుల్' భారం కాంట్రాక్టర్లపైకి!

- సీఎండీ అత్యవసర సమీక్ష
- 33 కేవీ కేబుల్ నిల్వ, నిలిచిపోయిన పనులపై ఆరా
- 'మిస్టర్ 10 శాతం' నుంచి తప్పించుకునేందుకు ఎత్తుగడ
- కేబుల్‌ను కాంట్రాక్టర్లే కొనుగోలు చేయాలన్న సంబంధిత అధికారులు
- జేబీఎస్ పనులను వారంలో పూర్తి చేయాలని ఏజెన్సీకి ఆదేశం
- మాకేం సంబంధం అంటూ సంబంధిత కాంట్రాక్టర్ల గగ్గోలు
- కొడంగల్‌కు 40 డీటీఆర్‌లు కేటాయించడంపై కొత్త వివాదం



నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 28(నమస్తే తెలంగాణ): టీజీఎస్పీడీసీఎల్‌లో సామగ్రి కొనుగోళ్లలో కమీషన్ల దందాపై నమస్తే తెలంగాణలో బుధవారం ప్రచురితమైన 'మిస్టర్ టెన్ పర్సెంట్' కథనం సంచలనంగా మారింది. సీఎండీ ముషారఫ్ ఫారుఖీ బుధవారం ముఖ్య విభాగాల చీఫ్ ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. 33 కేవీ కేబుల్ కొనుగోలు, 10 శాతం కమీషన్ వ్యవహారం బయటికి ఎలా తెలిసిందని అధికారులు ఆరా తీసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీంతోపాటు సంస్థ స్టోర్స్‌లో సామగ్రి నిల్వలపై చర్చించినట్టు సమాచారం. కేబుల్ లేక నిలిచిపోయిన పనులపై వివరాలు అడిగారని, సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ప్రశ్నించారని తెలిసింది. మిస్టర్ 10% కు కమీషన్ ముట్టజెప్పి కేబుల్ కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ తెచ్చుకునే పరిస్థితి లేకపోవడంతో, డిస్కంకు 33కేవీ కేబుల్ పెద్దగా అవసరం పడబోదు కాబట్టి కొనుగోలు చేయలేమంటూ అధికారులు చేతులెత్తేసినట్టు తెలిసింది. ప్రత్యామ్నాయంగా సంబంధిత కాంట్రాక్టర్లు, ఏజెన్సీలే కేబుల్ తెచ్చుకోవాలంటూ వారిపై భారం మోపాలని చూస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఏ రేటుకు తెచ్చుకోవాలో, ఏ కంపెనీ నుంచి తేవాలో తేల్చలేదని తెలిసింది. దీంతో కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు, ఆయా పనులకు సంబంధించిన అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇదే సమయంలో మిస్టర్ టెన్ పర్సెంట్‌కు ఎలా వివరణ ఇవ్వాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నట్టు ఎస్పీడీసీఎల్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

కొడంగల్‌కు 40 డీటీఆర్‌లు

కేబుల్ లొల్లి సద్దుమణగక ముందే ఎస్పీడీసీఎల్‌లో కొత్త వివాదం తెరమీదికి వచ్చింది. 25 కేవీ డీటీఆర్‌లను (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్) ఇష్టానుసారంగా రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి పెద్దల నియోజకవర్గాలకు సరఫరా చేస్తున్నారంటూ కాంట్రాక్టర్లు, వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా స్టోర్‌కు ఇటీవల 150 డీటీఆర్‌లు రాగా, అందులో 40 ట్రాన్స్‌ఫార్మర్లను సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌కే పంపించినట్టు చెప్పన్నారు. వానకాలం సీజన్‌లో 25 కేవీ డీటీఆర్‌లు రైతులకు చాలా ముఖ్యం. వాస్తవానికి 'ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి మొదట' పద్ధతిలో డీటీఆర్‌లను కేటాయిస్తుంటారు. కానీ నెలల కిందటే డీడీలు కట్టినవారిని పక్కనబెట్టి ఒక్క నియోజకవర్గానికే పెద్ద ఎత్తున ట్రాన్స్‌ఫార్మర్లు పంపి స్వామిభక్తి చాటుకుంటున్నారని చర్చ జరుగుతున్నది. దీంతో సీజన్ మొత్తం నష్టపోవాల్సి వస్తుందని అధికారుల వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ విషయంపై స్టోర్స్ అధికారులను ఆరా తీయగా.. పద్ధతి ప్రకారమే పంపిణీ చేస్తున్నామని, కొడంగల్‌కు అనుమతులు ఉన్నాయి కాబట్టే ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చామని తెలిపారు.

సమ్మర్ యాక్షన్ పనులపై అస్పష్టత

కేబుల్ లేక నిలిచిన పనులపై సీఎండీ సంబంధిత ఏరియా అధికారులతో మాట్లాడినట్టు సమాచారం. ముఖ్యంగా జూబ్లీ బస్‌స్టాండ్‌లో చార్జింగ్ స్టేషన్ పనులపై ఆర్టీసీ అధికారులతోనూ ఆరా తీసినట్టు తెలిసింది. అనంతరం ఏజెన్సీతో మాట్లాడారని, వారంరోజుల్లో పనులన్నీ పూర్తిచేయాలని ఆదేశించారని విద్యుత్ శాఖ అధికారి ఒకరు తెలిపారు. సమ్మర్ యాక్షన్ పనులు ముందుకు కదలకపోవడంపైనా చర్చ జరిగిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అవి ముందస్తు జాగ్రత్తగా చేపట్టే పనులే తప్ప, అత్యవసర పనులు కావని అధికారులు సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. వాస్తవానికి ఎండాకాలంలో ఓవర్‌లోడ్ పడకుండా అత్యవసరంగా పూర్తి చేసేందుకు అధికారులు టెండర్లు పిలిచి, మార్చిలోనే కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. అయితే 33 కేవీ కేబుల్ కొనుగోలుకు 'పెద్దల' అనుమతి రాకపోవడంతో ఎవరి కేబుల్ వారే తెచ్చుకోవాలని ఏప్రిల్ చివరి వారంలో చెప్పినట్టు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈ అంశంపైనా తాజా సమావేశంలో స్పష్టత రాలేదని సమాచారం.

డిగ్రీ సీట్ల కేటాయింపు జాబితా విడుదల

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి అర్హత సాధించిన విద్యార్థుల జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ సీటు కేటాయింపు స్థితిని అధికారిక వెబ్‌సైట్ https://tgrdccet.cgg.gov.in/TGRDCWEB/ or https:// mjptbcwreis.telangana.gov.in ద్వారా తెలుసుకోవచ్చు అని పేర్కొన్నారు. సీటు కేటాయింపు పొందిన విద్యార్థులు 30 నుంచి జూన్ 6 లోగా కేటాయించిన కళాశాలకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు ఇచ్చి అడ్మిషన్ పొందాలని సూచించారు. గడువులోగా హాజరు కాకపోతే సీటు రద్దు అవుతుందని వెల్లడించారు. ఇది మొదటి జాబితా మాత్రమే అని, ఇంకా ఖాళీ సీట్లు ఉంటే మరిన్ని కేటాయింపులు చేస్తామని తెలిపారు. మొదటి జాబితాలో సీటు రాకపోయిన విద్యార్థులు తదుపరి జాబితాను వెబ్‌సైట్‌లో చూడవచ్చని స్పష్టంచేశారు. వివరాల కోసం 040-23328266 నంబర్‌కు లేదా mjptbcwreis14@gmail.comకు మెయిల్ పంపించాలన్నారు.

'హీరా గోల్డ్' పిటిషన్‌పై విచారణ అనవసరం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): హీరా గోల్డ్ కుంభకోణంపై నమోదైన 4 కేసుల్లో ఆ కంపెనీ ఎండీ నౌహీరా షేక్ విచారణకు హాజరుకాకపోవడంతో గత నెల 29న నాంపల్లి కోర్టు జారీచేసిన నాన్-బెయిలబుల్ వారెంట్‌ను రద్దు చేయాలన్న పిటిషన్‌పై విచారణకు హైకోర్టు నిరాకరించింది. నౌహీరాషేక్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసినందున నాన్-బెయిలబుల్ వారెంట్ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ అవసరంలేదని జస్టిస్ కే శరత్ తేల్చిచెప్పారు.

సింగరేణి లాభాల్లో కార్మికుల వాటా ఏది?

ఆర్థిక సంవత్సరం ముగిసి 2 నెలలైనా ప్రకటించని యాజమాన్యం

పెద్దపల్లి, మే 28 (నమస్తే తెలంగాణ): సింగరేణి గనుల్లో నిత్యం చెమటోడ్చి నల్లబంగారాన్ని వెలికి తీస్తున్న కార్మికులు సంస్థ లాభాల్లో వాటా కోసం ఎదురుచూస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసి 2 నెలలు గడిచినా ఇప్పటి వరకు యాజమాన్యం తమ లాభాల వివరాలను, శ్రామికుల వాటాను ప్రకటించకపోవడంతో బొగ్గుగని కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోల్ ఇండియా పరిధిలోని సంస్థలన్నీ తమ కార్మికులకు సకాలంలో లాభాల వాటా పంచుతుంటే.. సింగరేణిలో మాత్రం ఏటా ఆలస్యమవుతున్నదని మండిపడుతున్నారు.

నిరుడు 69.01 మిలియన్ టన్నుల ఉత్పత్తి

రాష్ట్రంలో సింగరేణి విస్తరించి ఉన్న 6 జిల్లాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 72 వేల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగడంతో సంస్థకు రూ.2,412 కోట్ల లాభాలు వచ్చాయి. అందులో కార్మికులకు 33% వాటా ప్రకటించి, వారి ఖాతాల్లో రూ.795 కోట్లు జమ చేసింది. కానీ, 2024-25 సింగరేణి 69.01 వేల మిలియన్ టన్నుల బొగ్గును మాత్రమే ఉత్పత్తి చేయగలిగింది. ఇది క్రితం ఏడాది కంటే 3 వేల టన్నులు తక్కువ. అయినప్పటికీ దేశీయ మార్కెట్లో బొగ్గుకు డిమాండ్ భారీగా ఉండటంతో లాభాలు అత్యధికంగానే వచ్చి ఉంటాయని కార్మికులు భావిస్తున్నారు. 2019-20లో 993 కోట్ల లాభంలో కార్మికులకు 28% వాటా ఇచ్చింది. 2020-21లో 29 శాతానికి, 2021-22లో 30 శాతానికి, 2022-23లో 32 శాతానికి, 2023-24లో 33 శాతానికి వాటా పెంచింది. ఈసారి సింగరేణికి భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉండటంతో తమ వాటా శాతాన్ని పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

జస్టిస్ వినోద్‌కుమార్ బదిలీ

హైదరాబాద్, మే 28, (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన జస్టిస్ వినోద్‌కుమార్ 2019 ఆగస్టు 19న హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుతం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని కూడా కొలీజియం నిర్ణయించింది. తెలంగాణ హైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా అపరేశ్‌కుమార్‌సింగ్‌ను నియమించాలని కొలీజియం 26న కేంద్రానికి సిఫార్సు చేసిన అధికారిక పత్రం బుధవారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఏకే సింగ్ బదిలీపై తెలంగాణకు రానున్నారు. జస్టిస్ పాల్, జస్టిస్ వినోద్‌కుమార్ బదిలీ కాగా కొత్తగా చీఫ్ జస్టిస్‌తో పాటు మరో ముగ్గురు న్యాయమూర్తులు (కర్ణాటక నుంచి జస్టిస్ సుమలత, జస్టిస్ లలిత, పాట్నా హైకోర్టు నుంచి జస్టిస్ అభిషేక్‌రెడ్డి) తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు. తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరనుంది. 11 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉంటాయి. నాలుగు రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకోగా, అందులో తెలంగాణకు చెందిన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు జార్ఖండ్ హైకోర్టు సీజేగా వెళ్లనున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ దవాఖానలో బిడ్డతో కలెక్టర్

ప్రభుత్వ దవాఖానలో కలెక్టర్ సతీమణి ప్రసవం

మగ బిడ్డకు జన్మనిచ్చిన భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ భార్య

పాల్వంచ, మే 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సతీమణి శ్రద్ధ పాల్వంచ ప్రభుత్వ దవాఖానలో బుధవారం మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో కలెక్టర్.. తన సతీమణి గర్భం దాల్చినప్పటి నుంచి పాల్వంచ ప్రభుత్వ దవాఖానలో పరీక్షలు చేయించడంతోపాటు వైద్యుల సూచన మేరకు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లా వైద్య సమన్వయ అధికారి రవిబాబు, దవాఖాన సూపరింటెండెంట్ రాంప్రసాద్, సర్జన్ సోమరాజు దొర, అనస్తీసియా డాక్టర్ ప్రసాద్ సమక్షంలో నర్సింగ్ ఆఫీసర్ స్వర్ణలత, గైనకాలజిస్టు సరళ, అనూష సిజేరియన్ చేయడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చారు.

రాష్ట్రమంతా 'నైరుతి' విస్తరణ

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు బుధవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. దీంతో రానున్న రెండురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాలలో అత్యధికంగా 127.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లా చిన్నగూడురులో 70.1 మి.మీ. నమోదైంది. 31 నుంచి జూన్ 7 వరకు రుతుపవనాలు బలహీనంగా ఉండనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొన్నది. రైతులు ఇందుకు అనుగుణంగా వ్యవసాయ పనులను ప్లాన్ చేసుకోవాలని సూచించింది. జూన్ 10 తర్వాత తదుపరి దఫా రుతుపవనాల కారణంగా వర్షాలు కురుస్తాయన్నది.